# గైడ్ గైడ్ గైడ్

ఎం.ఏ రహిమాన్



"కుమార్ బాబు బుద్ధిమంతుడైపోయాడు!''

ఆ సంగతి తెలుసుకున్న అతని స్నేహితులకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఈనాడు కుమార్ బాబు బుద్ధిమంతు డయ్యాడంటే ఇదివరకు ఎంతగా చెడిపోయాడో వూహించుకుంటే అర్థమవుతుంది.

''జీవితం అన్ని విషయాలలో అనుభవం కొరకే !'' నన్న సూక్తిపై సూటిగా నడిచే కుమార్‌బాబు కలవారి అబ్బాయి కాబట్టి డబ్బుకు కరువుండదు. చదువు సంధ్యలకు 'ఫుల్ స్టాప్' పెట్టేసి రకరకాల విలాసాలతో, వినోదాలతో కాలం వృధా చేస్తుండేవాడు. పెద్దలు ఎంత మందలించినా లాభంలేకపోయింది. అలాంటివాడు ఒక్కసారిగా బుద్ధిమంతుడై పోవడానికి కారణమేమై వుంటుంది ? అని ఎంతగా ఆలోచించినా అతని స్నేహితులకు అర్థం కాలేదు.



కుమార్‌బాబుకు ''పేకాటంటే'' మహా పిచ్చి. పెద్ద పెద్ద మొత్తాలతో ఆడకపోతే ఆట ఆడినట్టుండేది కాదు...''మంచి మందు'' అంటే ఎగిరిగంతు లేసేవాడు. ఇప్పుడు అతని విలాసాలలో వినోదాలలో పాలు పంచుకున్న స్నేహితులు పేకాటకు పిలిచినా, మంచి మందుపార్టీ చేసుకుందామన్నా... కుమార్‌బాబు ఇచ్చే సమాధానం వింటే విచిత్రంగా ఉంటుంది.

''ఒరేయ్ ! సమయం సందర్భాన్ని బట్టి పేకాట సరదాగా ఆడుకోవాలిగాని అలవాటుగా ఆడకూడదురా ! భవిష్యత్తుకే ప్రమాదం. మనం ఆశతో ఆడుతూ ముందుకుపోతాం, తర్వాత తిరిగి చూస్తే... ఆర్థికంగా, మానసికంగా దెబ్బ తింటాం. ఇక మందుపార్టీ విషయం అంటారా.. అసలు మనం పుట్టింది కళ్ళుతెరచి బ్రతకడానికి. జీవితంలో సగంకాలం నిద్రకే సరిపోతుంది. రెండవసగంలో మత్తులోకి ఒరిగితే... అది చాలా అనర్థాలకు గురితీస్తుంది... అది మన క్యారక్టరునే దెబ్బతీస్తుంది'' అని వేదాంతిలా మాట్లాడుతున్నాడు.

ఫలానా అమ్మాయి బలేగుంటుంది. కాసేపు ఆట పట్టిద్దామా ? అనంటే. ''అమ్మాయిల మనసులలో అభిమానం సృష్టింపబడేలా ప్రవర్తించాలిగాని ఏడిపించి కాదురా !'' అని ఎంతో మంచివాడులా చెబుతున్నాడు. కనీసం సినిమాకైనా, విడియో గేమ్స్‌కైనా వెడదాం రారా అనంటే,

''పరీక్షలు దగ్గర పడుతున్నాయి - రా ! చిన్నవయసులోనే చక్కగా చదువుకోవాలిరా ! వయసు ముదిరితే చదువు ఒంటపట్టదు, కనుక యిప్పుడు బి. కాం. 'ఫస్ట్‌క్లాస్'లో పాసయ్యేలా ప్రయత్నిస్తున్నాను. సినిమాలు ఎప్పుడు వస్తూనే వుంటాయి. పరీక్షల తర్వాత చూసుకోవచ్చు. కాని పోయిన కాలం తిరిగిరాదు కదరా !'' అని ముక్తసరిగా సమాధానమిచ్చి చిరునవ్వుతో వెళ్ళిపోయే కుమార్‌బాబును చూస్తుంటే అతని స్నేహితుల్లో కొంతమందికి మంటగా... అసూయగా వుంటుంది.

ఆసలు అతనిలో మార్పు కారణం ఏమిటో ప్రత్యక్షంగా అతన్నే అడిగే ధైర్యం చాలక, ఆరా తీయమని 'కిరణ్' అనేవాడికి బాధ్యత అప్పజెప్పారు స్నేహితులు. కిరణ్ డిటెక్టివ్ లాంటివాడు. ఏ విషయాన్నయినా తెలివిగా, తేలిగ్గా ఆరా తీయడం అతని ప్రత్యేకత.

ఓ వారం రోజుల తర్వాత స్నేహితులందరూ కలుసుకున్నపుడు కుమార్‌బాబు గురించి వివరాలు చెప్పాడు కిరణ్.

''ఒరేయ్ ! కుమార్‌గాడు బుద్ధిమంతుడవడానికి కారణం ఒక రిక్షావాడురా !''

''ఆఁ... రిక్షావాడా ?... ఎలారా ?'' అని అందరూ ఆశ్చర్యంగా అడిగారు.

''రంగయ్య అని... మా అన్నయ్యవాళ్ళ పిల్లలను, మా ప్రక్కింటివాళ్ళ పిల్లలను జీతం మీద రోజూ స్కూలుకు తీసుకెళ్ళి, మళ్ళీ సాయంకాలం తీసుకొస్తుంటాడు. ఒకరోజు కుమార్‌బాబు నన్ను సినిమాకు తీసుకెడదామని మా యింటికొచ్చాడు. ఓ పది నిమిషాలు కూర్చోరా... అంటే వరండాలో కూర్చొని పత్రికలు తిరగేస్తున్నాడు. అప్పుడు రంగయ్య

కీతం కోసం వచ్చాడు అప్పటికి అతని జీతానికి వారం గడువుంది. ముందుగా అడుగుతున్నందుకు కారణం అడిగితే, అతను తన కొడుకు రాముడు ఎం. కాం. ఫైనల్ యియర్ పరీక్ష ఫీజుకు డబ్బు అవసరం వచ్చిందని చెప్పాడు. అదంతా విన్న కుమార్‌బాబు రంగయ్యను పరీక్షగా చూశాడు. బాగా పరిచయమున్న వ్యక్తి... అన్న సంతోషంగా లేచాడు. కాని ఏమనుకున్నాడో ఏమో... గతాన్ని తలచుకుంటూ, పూర్వజన్మ గుర్తుకొచ్చినవాడిలా కూర్చుండిపోయాడు.''

''అవునూ...రిక్షావాడు తన కొడుకు కోసం డబ్బులడిగితే అవసరానికి ఆదుకోవచ్చుగాని, యిలా ఒక్కసారిగా అలవాట్లన్నీ మార్చుకుంటానికి సంబంధం ఏమిటి ?, మరింత ఆశ్చర్యంగా అడిగారు...స్నేహితులు.

''అక్కడేవుంది లి టి కే ష న్ ... అది చెప్పాలంటే ఒక కధగా చెప్పాలి. వినే ఓపిక మీకుంటే చెబుతాను'' అని కిరణ్ అందరి ముఖాల వైపు పరిశీలనగా చూశాడు.

''ఊఁ...ఊఁ...అది కూడా చెప్పేయ్ !'' అన్నారు అందరూ.

కిరణ్ కుమార్‌బాబును గూర్చి కధగా చెప్పడం మొదలెట్టాడు.

అది షుమారు పన్నెండు సంవత్సరాల క్రితం నాటిమాట.

అప్పుడు కుమార్‌బాబు మూడవ క్లాసు చదువుతూండే వాడు. ఒకరోజు వాళ్ళ క్లాసు మాష్టారు జరిగిన పాఠాల్లో ప్రశ్నలువేసి అందరి అంతు తేల్చుకున్నాక, క్రొత్తగా ఒక నీతి శతకాన్ని ప్రారంభిస్తూ, అందులోని పద్యాలను ఒక్కొక్కరిని వరుసగా చదవమన్నారు.

ఒక్కొక్కరి తర్వాత కుమార్‌బాబు వంతు వచ్చింది. కుమార్‌బాబు క్లాసులో అందరికంటే అందంగా వుంటాడు. ఎంత అందంగా అని... సరిగ్గా చెప్పాలంటే 'న్యూట్రమూల్' బోయ్ లాగానో...లేదా...మిలమిలమెరిసే సిమ్లా ఆపిల్ పండులా వుండేవాడు. అంత అందంగా వున్న కుమార్‌బాబులో ఒక్కటే లోపం...అతనిది కాస్త బండనాలిక. పద్య పదాలనే కాదు, చిన్న చిన్న మాటలను కూడా అతను సరళంగా వుచ్ఛరించిలేడు. ఇప్పుడు ఆ లోపం సవరించుకోగలిగాడనుకోండి. ఆ విషయం క్లాసులో అందరికి తెలుసు. అందరూ నవ్వుతారని లేచి నిలబడి క్షణంసేపు పుస్తకాన్ని, మరోక్షణం మాష్టారి వైపు, మరోసారి నవ్వుతున్న సహవిద్యార్థుల వైపు చూస్తూండి పోయాడు.

''చదవవేంరా !'' అని గద్దించి అడిగారు మాష్టారు. పాపం! కుమార్‌బాబు బెదిరిపోయి,

''నాకు రాదండి !'' అన్నాడు ఎలాగో.

''మా ష్టా రూ ! ... వాడిది బండనాలికండి !'' అని ఎవరో అంటే మాష్టారు వారించి,

''చ దు వు నా య నా !'' అని మరోసారి అన్నారు.

''కావాలంటే పేముబెత్తంతో పదిదెబ్బలు తింటానుగాని చచ్చినా చదవను'' అన్నట్టు చేయిచాచి మాష్టారినే తీక్షణంగా చూస్తూ నిలబడ్డాడు కుమార్‌బాబు.

అతని దీనస్థితికి మాష్టారుకు జాలికలిగి, అతని వంతుకు వచ్చిన పద్యాన్ని పదిసార్లు చూసి వ్రాయమన్నారు.

తరువాత వంతు రాముడిది.

రాముడు చాలా పేదింటి పిల్లవాడు. అందంలో కుమార్‌బాబు కంటే తీసిపోడు. ఒక్కమాటలో చెప్పాలంటే కలకత్తా జామ పండులా వుంటాడు. చాలా తెలివైనవాడు. బాగా చదువుతాడు. కాని ఏం లాభం ? ... అతనికి అచ్చుపుస్తకమేకాదు... అతని నిక్కరుకు కూడా గుండీలు లేవు.

తనవంతు రాగానే లేచి ... వూడిపోతున్న నిక్కరుకు బ్రహ్మముడిలాటిది ఒకటి నడుముకు బిగించి, కాస్త కంగారుపడుతూ ప్రక్కనున్న కుమార్‌బాబు దగ్గర పుస్తకం తీసుకొని చదవబోయాడు. ఇదంతా చూస్తున్న మాష్టారు,

''ఏరా ! నీ అచ్చుపుస్తకమేమయింది ?'' అనడిగారు.

''మా అమ్మ కొనివ్వలేదు మాష్టారూ !''

''అ మ్మ ం టు న్నా వు ? ... నాన్న ఏమయ్యాడురా ?''

''మా నాన్నను అడిగితే కాళ్ళు యిరగతంతానంటాడు మాష్టారూ !''

''అబ్బా ! ... అంతటి మహానుభావుడా ? ఏం చేస్తూంటాడురా ?''

''రిక్షా త్రొక్కుతాడు.''

''అదా సంగతి ! సరే ... ఎవరిదో పుస్తకం తీసుకున్నావుగా చదువు !''

అంతలో నిక్కరు మళ్ళీ వూడితే రాముడు సర్దుకొని చదవబోతుంటే,

''ఏరా ... నిక్కరుకు గుండీలు లేక పోతే పిన్నీసు పెట్టుకోకూడదూ ?'' అని చెవి మెలేశారు. మాష్టారు.

''మా అమ్మను ఎన్నిసార్లు అడిగినా యివ్వలేదు మాష్టారూ ... అంతలో బడికి టైమయిపోతే పరుగెత్తుకొని వచ్చేశాను.''

''ఇలా సిగ్గు వదిలేశా ?'' అని మాష్టారంటే అవునన్నట్టు అమాయకంగా తలూపాడు రాముడు. అప్పుడు మిగతా పిల్లలందరూ ఘొల్లుమని నవ్వారు. తర్వాత మాష్టారు ఒకడి దగ్గర పిన్నీసు తీసుకొని స్వయంగా రాముడి నిక్కరుకు పెడుతూంటే ... పాపం ! రాముడు నిజంగా సిగ్గుపడిపోయాడు.

తర్వాత రాముడు తన వంతు కొచ్చిన పద్యాన్ని చదవక రాగం తీసి మధురంగా పాడాడు. మాష్టారు తన్మయులై, ''భగవంతుడా ! యింత చక్కని బాలుడికి పేదరికం అంటగట్టావా ? '' అని తనలో తానే ప్రశ్నించుకున్నారు.


అంతలో...

''మా రా ము ణ్ని ఒకసారి పంపండి మాష్టారూ ! '' అని ఒక స్త్రీ తరగతి గది బయట నిలబడి అడిగింది.

పోలికలను బట్టి చూస్తే ఆమె రాముడి 'తల్లి' అని స్పష్టంగా తెలిసిపోతుంది. తన విద్యార్థుల లోపం తల్లిదండ్రులకు చెప్పడం మాష్టారికి అలవాటు.

''ఏమ్మా ! రెండు వారాల నుంచి చెబుతున్నా పిల్లలకి పు స్త కా లు కొనివ్వటం తెలియదా ? '' అనడిగారు.

''ఏమయింది మాష్టారూ ?'' అని బిక్కమొహంవేసి అన్నది రాముడి తల్లి.



''ఏమైందని అడుగుతావేమిటమ్మా ? ... రాముడికి పుస్తకాలే కాదు ... వాడి నిక్కరుకు గుండీలు కూడా లేవు. నువ్వు తల్లివై వుండి వాడికేం కావాలో చూడాలి ? ... లేదా ? ''

అప్పుడు రాముడి తల్లి తన పెద్దరికం మీద అభిమానంతో, అహంకొద్ది...

''వాడికి అన్నీ కొనిపెట్టాను మాష్టారు ! వాడు పోగొట్టుకుంటూంటాడు !'' అని అబద్ధాన్ని అందంగా పచ్చినిజంలా చెప్పేసింది. అప్పుడు మాష్టారు వెర్రికోపంతో...

''ఏరా ! పుస్తకాలు పోగొట్టుకొని, అమ్మ కొనివ్వలేదని అబద్ధాలు చెబుతావా ? ... అబద్ధాలూ ... !'' అంటూ పేముబెత్తంతో ''షవ్ షవ్''మని రాముడ్ని ఎక్కడబడితే అక్కడ బాదారు.

పాపం! చిన్నారి రాముడు ఆ దెబ్బలకు తట్టుకోలేక, 'అమ్మోయ్ ! ... బాబోయ్!'' అంటూ అల్లాడిపోయాడు.

''ఏదో రెండు దెబ్బలు కొట్టి వూరు కుంటాడు అనుకుంటే, పశువును బాదినట్టు బాదుతాడేంటి యీ పంతులూ!'' అనుకొని రాముడి తల్లి, తన తప్పుకు తనలో తాను తిట్టుకుంటూ, ''ఈసారి కొనిస్తే జాగ్రత్తగా వుంచుకుంటాడు లెండి మాష్టారు.'' అన్నది– రాముడ్ని దగ్గరకు తీసుకుంటూ.

''లేదు లేరా! మన మాష్టారేగా కొట్టింది. మేష్టారు ఎంతకొడితే అంత బాగా చదు వస్తుందిరా!'' అని వూరడించి రాముడి కళ్ళ నీళ్ళు తుడిచింది.

జరిగినదంతా కుమార్‌బాబు, మిగతా పిల్లలు దిగ్భ్రాంతి చెంది చూస్తుండిపోయారు. తర్వాత రాముడి తల్లి వచ్చిన పనేమిటో చెప్పేసి వెళ్ళిపోయింది.

కుమార్‌బాబు, రాముడు మంచిస్నేహితులు. బడి వదిలిన తర్వాత కుమార్‌బాబు వుండలేక, అడిగేశాడు.

''రాముడూ ! ... నిజంగా మీ అమ్మ పుస్తకాలు కొనియిచ్చిందా ?''

''లేదురా ! అంతా అబద్ధం.''

''ఎందుకని అలా చెప్పిందిరా ?''

''మనం చిన్నోళ్ళం కదా...ఏమి చేయ లేమని''

''పాపం! నిన్ను బాగా కొట్టారురా మాష్టారు'' అన్నాడు జాలిగా. అప్పుడు రాముడి కింకా దుఃఖం వుబికి వచ్చింది. అతనితోబాటు కుమార్‌బాబుకు కూడా ఏడుపు వచ్చేసింది.

కుమార్‌బాబుకి లెక్కలు చేయడమంటే చాలా యిష్టం. అందుకు రాముడ్ని కూడా రమ్మంటూంటాడు తన యింటికి. ఏంచక్కా కలసి లెక్కలు చేసుకోవచ్చని. కాని రాముడు తనకు యింట్లో చాలా పనుంటుందని చెప్పాడు. అర్థంకాక కుమార్‌బాబు–

## గైడ్ – గైడ్ – గైడ్

''ఎందుకని ?'' అన్నాడు దీర్ఘంగా.

''మా నాన్న రిక్షా తీసుకెళ్ళగానే మా అమ్మకూడా కూలిపనికి వెళ్ళిపోతుంది. కనుక నువ్వే మా యింటికి రా!'' అన్నాడు రాముడు.

''సరే''నని కుమార్‌బాబు ఒకరోజు రాము డింటికి వెళ్ళాడు.

రాముడు చాలాసంతోషంతో ఆహ్వానించాడు. తన చెల్లెల్ని చూపిస్తూ, ''మా చెల్లి రాజి !'' అన్నాడు. మళ్ళి వెంటనే–

''చాలా బాగుంది కదూ !'' అన్నాడు.

''అవునూ చాలా బాగుంది...బెంగుళూర్ ద్రాక్ష పండులా !'' అన్నాడు కుమార్‌బాబు. తర్వాత రాముడు చాపపరచి కూర్చోమన్నాడు. కుమార్‌బాబు తాను తెచ్చుకున్న చాక్లెట్లు రాము డికి, చెల్లి రాజీకిస్తూ కూర్చున్నాడు. అంతలో రాముడి తల్లి వచ్చింది. అబ్బాయి ఎవరో తెలుసు కొని సంతోషించింది.

''ఇద్దరూ చక్కగా చదువుకోండినాయనా'' అని కూతుర్ని ఎత్తుకొని లోపలికెళ్ళింది. చాలా సేపటిదాకా యిద్దరు మిత్రులు చదువుకున్నారు.

అంతలో ఏవో పాటలు పాడుకుంటూ, తూలుతూ రాముడి తండ్రి రంగయ్య వచ్చాడు.

''మా నాన్న !'' అన్నాడు రాముడు.

''అబ్బ...ఎంత ఛండాలపు వాసనా !'' అని ముక్కు మూసుకున్నాడు కుమార్‌బాబు.

''మా నాన్న సారా తాగుతాడు అందుకని వాసన''.

''సారా తాగితే పోలీసోళ్ళు పట్టుకోరూ ?'' అని అడిగాడు కుమార్‌బాబు ఎప్పుడో ఎవరో చెప్పినట్టు గుర్తు చేసుకుంటూ.

''ఇప్పుడు పట్టుకోరు. అందుకే మా నాన్న రోజూ తాగి వస్తున్నాడు.''

''ఎందుకని ?''

''గాంధిగారు పుట్టి నూరేండ్లు దాటిందట. ఆ తర్వాత ఆంధ్రరాష్ట్రం వచ్చిన రోజునతాగితే తప్పులేదని లైసెన్సు యిచ్చేశారంట...యిదం మానాన్న అమ్మతో గొప్పగా చెబుతూంటె విన్నాను.'' అన్నాడు రాముడు.

తూలుతూ వచ్చిన రంగయ్య మంచ మీద కూర్చొని పిల్లల సంభాషణ ఏం పట్టనట్టు వెళ్ళి,

''ఏవేఁ సుబ్బులు ! అన్నం పెట్టవే'' అం వంటగది వైపు వెళ్ళాడు. అప్పుడు పిల్లలిద్దరు వాకట్లోకి చాప వేసుకొని కూర్చున్నారు.

రంగయ్య, సుబ్బుల మధ్య ఏం సంభాషణ జరిగిందో ఏమో... రంగయ్య కోపంగా అన్నం, కూరగిన్నెలన్నీ బయటికి తీసుకొనివచ్చి గిరాటు వేసి, మళ్ళీ లోపలికి వెళ్ళి భార్యను బంతిలా తన్నుకుంటూ బయటికి వచ్చాడు. జుట్టును గిరాగిరా త్రిప్పి డొక్కలో కాలుతో తన్నాడు. ఆ దెబ్బకు తాళలేక సుబ్బులు,

''ఓరి దేముడో... చచ్చిపోతున్నారో...'' అని లబోదిబోమంటూ బిగ్గరగా కడుపు పట్టుకొని ఏడవసాగింది.

ఊహించని యీ సంఘటనకు కుమార్ బాబు లేచి నిలబడి వణికిపోసాగాడు. రాముడెళ్ళి చెల్లెలిని ఎత్తుకొని,

''నాన్నా... నీకు బుద్ధి లేదు... మనిషివి కాదు'' అన్నాడు.

''ఏందిరోయ్... పేలుతున్నావ్ ?'' అని దగ్గరున్న కర్ర అందుకున్నాడు రంగయ్య. రాముడు వెంటనే చెల్లిని కుమార్‌బాబు చేతి కిచ్చేసి తుర్రున బయటికి పరుగెత్తాడు

''ఏవేఁ... నన్ను ఎదిరిస్తావా ?... నన్ను లెక్కలడుగుతావా ?'' అని భార్యను బాదసాగాడు. ఆమె అరుపులకు పక్కింటి పరమానందం, ఎదురింటి ఎలమంద, వెనకింటి వెంకమ్మ, యింకా చుట్టుప్రక్కల చిన్నా పెద్దా అంతా వచ్చి గుమిగూడారు. ఒకడు వచ్చి రంగయ్య చేతిలోని కర్ర లాక్కుంటే ఒకడు గట్టిగా పట్టుకొని మర్యాదగా,

''ఏంటి రంగన్నా... ఏం జరిగింది ?'' అనడిగాడు.

''ఏంటా... యిది నా పెళ్ళాం... నేను మొగుణ్ని...నేను చెప్పినట్టు యిది పడివుండాల... అవునా ?...'' అని ఎర్రటి కళ్ళతో వచ్చిన పెద్దమనుషులవైపు చూశాడు. ''చెప్పూ చెప్పూ'' అన్నట్టు అందరు మౌనంగా వింటూంటే–

''యిది నన్ను లెక్కడగుతాది. కోడికూర వండమని రెండు... రెండు రూపాయలిచ్చి వెళ్తే... పచ్చిపులుసు... బెండకాయ వేపుడూ... మజ్జిగా అంట... యిది నాకు పెట్టేది. సూత్తున్నకొద్ది నెత్తికెక్కి కూకుంటున్నది'' తూలుతూ రొప్పుతూ మాట్లాడుతూనే వున్నాడు రంగయ్య.

''రెండు రూపాయల్లో నేను బియ్యం,

### ఈ దేశంలో...

ఏ ఇంటిగోడలు చూసినా
''నల్లగుండుని'' మోసిన
శ్రీనాధునిలాగా
బాధాకరమైన
''వినాదాల్ని'' మోస్తూ
తడగాళ్ళు పడుతూ
దైన్యంగా,
హైన్యంగా
కన్పిస్తుంటాయి !!

– కె. కిశోరుబాబు
– కె. అశోకుబాబు

# తెలుసుకోండి

సేల్సుటాక్సు: ఆంధ్ర మరియు సెంట్రలు సేల్సుటాక్సు చట్టాలు, రూల్సు, దేనికెంత పన్ను, పినాల్టీలు, అప్పీళ్ళు, ఎక్కౌంట్సు, విధానాలు, తనిఖీలు, సేల్సుటాక్సు అన్ని విషయాలు. వెల రు. 25.

ఇన్‌కంటాక్సు: రాబడి పన్నుల వివరాలు, రాయితీలు, జాగ్రత్తలు, గిఫ్టు, వెల్త్, కేపిటల్ గెయిన్ టాక్సులు, ఎస్టేట్ డ్యూటీ, నేరాలు, పినాల్టీలు, అప్పీళ్లు అన్ని విషయాలు. వెల రు 25.

వ్యవహారదర్శిని: మీ నిత్య వ్యవహారాలకు, అనేక చట్టాల వివరాలు, వివిధ పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు వ్రాసే విధానాలు, వాటి అనేక నమూనాలున్నాయి. వెల రు.12. నేటివరకు వచ్చిన అన్ని మార్పులతో అడ్వకేటు మూర్తిగారు అందరికి తెలిసేలా తెలుగులో వ్రాశారు. పోస్టు ఖర్చు రు.7 అదనం. ఏ రెంటికైనా పోస్టేజి ఉచితం. దేశసేవ ప్రచురణలు, 2 ఇందిరానగరు, వెంగళరావునగర్ టాంకు సమీపాన, హైదరాబాదు-500890 కు వ్రాస్తే మీకు వి.పి.పి. ద్వారా వస్తాయి.


# గైడ్ - గైడ్ - గైడ్

కోడికూర ఎలా తేనయ్యో'' అని బాధగా ఏడుస్తూ అన్నది సుబ్బులు.

''అదిగో మళ్ళీ నోరెత్తుతుంది ... నేను మొగుణ్ణి ... నువ్వు ... నేను చెప్పినట్టు చేసి పడివుండాలా !'' అని మళ్ళీ కొట్టబోయాడు. అంతలో యిద్దరు పట్టుకుంటే –

''వదలెండెహే !'' అని విదిలించుకొని వాళ్ళమీద తిరగబడ్డాడు. ఏదోలే ! అని వూరుకుంటే మరీ రెచ్చిపోయాడు రంగయ్య మత్తులో.

''వీడి సంగతి వూరుకుంటే లాభంలేదు. బక్కెట్టు నీళ్ళుపోసి మంచానికి కట్టెయ్యెండని'' అన్నాడు ఎలమంద. అన్నట్టు అందరూ అదే పనిచేశారు.

''అయ్యోయ్యో...చచ్చిపోతాడు బాబోయ్'' అని గొడవ చేయసాగింది సుబ్బులు.

''నిన్ను చంపుతుంటే లెక్కలేదుగాని ... మంచానికి కట్టేస్తే చస్తాడా? నువ్వూరుకోమ్మా! వెళ్ళి పిల్లను ఎత్తుకో ముందు. అరగంటనుంచి ఏడుస్తోంది'' అన్నాడు పక్కింటి పరమానందం. సుబ్బులు పిల్లను అందుకుంటూ,

''బెదిరిపోయావా బాబూ ? యిదంతా మాకు రోజూ మామూలే !'' అన్నది బాధలో కూడా నవ్వు తెచ్చుకుంటూ.

జరిగినదంతా చూసిన కుమార్‌బాబు చలించి పోయాడు.

సద్దుమణిగాక రాముడొస్తే ... క్రింద పడిన అన్నాన్ని కంచంలో తీసిపెట్టింది సుబ్బులు. అది కళ్ళార చూసిన కుమార్‌బాబు తన స్నేహితుని స్థితిని చూసి ద్రవించిపోయాడు. ఇంట్లోవున్నా...ఏం చేస్తున్నా కుమార్‌బాబుకు,

''రాముడు కూడా తనలాగే చక్కటి బట్టలేసుకొని చక్కగా వుంటే ఎంత బాగుండును?'' అని ఒక ఆలోచన. ''నాన్నగారు అలాచేయరే ! ... మరి రాముడి నాన్న ఎందుకు అలాచేస్తాడు ?'' అని బాధపడసాగాడు ఉండలేక రాముడి గూర్చి వాళ్ళ అమ్మా, నాన్న తాతగార్లతో చెప్పి బావురుమనేవాడు.

''రాముడు చాలా మంచివాడు. అతను నాలాగే హాయిగా ఉండాలి. రాముడు బాధపడుతూంటే నేను చూడలేను !'' అని మరిమరి యింట్లోవాళ్లతో చెప్పుకునేవాడు. అతని పెద్దలు ఏదో సర్దిచెప్పి అతన్ని బుజ్జగించేవారు.

కొన్నాళ్ళ తర్వాత కుమార్‌బాబు వాళ్ళు యిల్లు మారవలసి వచ్చింది. కొత్త యిల్లు రంగియ్యవాళ్ళ రిక్షాకార్ఖానా దగ్గర ఉంది. ఇల్లు స్కూలుకు చాలా దూరముందని, కుమార్‌బాబు రోజూ వెళ్ళి రాలేడని జీతంమీద రిక్షావాడ్ని మాట్లాడితే మంచిదని నిర్ణయించారు కుమార్ బాబు పెద్దలు.

అదృష్టం కొద్దీ ఆ అవకాశం రంగయ్యకే వచ్చింది. కుమార్‌బాబు మున్ముందు రంగయ్యను చూసి భయపడినా తర్వాత రంగయ్య కలుపుగోలుతనాన్ని చూసి ధైర్యం తెచ్చుకున్నాడు. రంగయ్య సరదాగా కబుర్లు చెపుతూ కుమార్‌బాబును బాగా ఆకర్షించాడు.

ఆ సంగతి తెలిసిన రాముడు చాలా సంతోషించాడు. కాని కుమార్‌బాబు మాత్రం తామ స్నేహితులమని రంగయ్యకు తెలియనీ వద్దన్నాడు అటు రంగయ్య ఎవడో వాళ్ళ అమ్మా నాన్నలకు తాతగారికి తెలియనివ్వలేదు.

రంగయ్య మాత్రం కష్టపడి బాగా సంపాదించేవాడు. కాని అంతా నాటుసారాకు ధారబోసేవాడు. ఒకసారి బాగా త్రాగేసి ఒళ్ళుతెలియని మైకంలో పడిపోయాడు. ఉన్నపంచి ఊడిపోయి దిగంబరంగా ఉన్నాడు. అది నడివీధి. అటు వచ్చిన రాముడు, కుమార్‌బాబులు చాలా బాధపడ్డారు. నిషాదిగిన తర్వాత కుమార్‌బాబుఅడిగితే రంగయ్య నాకేం గుర్తులేదన్నాడు. ''అందుకే తాగినవాడు పశువుతో సమానం'' అని తాతగారు చెప్పిన మాట గుర్తుకొచ్చింది కుమార్‌బాబుకు.

కొన్నాళ్లకు రంగయ్యకు నాటుసారాపై మోహం ఎత్తింది. ఆలోచన బ్రాంది, విస్కీలపై మళ్ళింది. 'ఒకేసారి పెట్టుబడి కావాలి కదా ' అని ఆలోచిస్తుంటే కుమార్‌బాబు వాళ్ళు యిచ్చే జీతం గుర్తుకొచ్చింది.

''బలే !...తింటే అడవి మాంసం తినాలి గాని... యీ చప్పిడిరకాలు ఎన్నాళ్ళు కొట్టినా యింతే !'' ననుకొని జీతంకోసం ఎదురు చూడసాగాడు.

అయినా మధ్య మధ్యలో తాగటం యింట్లో భార్యా పిల్లలను ఏడిపించడం మాత్రం మానలేదు. అన్ని విషయాలు కుమార్‌బాబుకు తెలుస్తూనే వున్నాయి.

ఇటు రాముడుకు స్కూల్లో చాలా గడ్డు రోజులు వచ్చాయి. అచ్చు పుస్తకాలు, నోట్సులు వగైరా వగైరా లేవని మాష్టారు రాముడ్ని కష్టపెడుతూనే వున్నారు. బెంచి ఎక్కిస్తున్నారు. గంటల తరబడి ఎండలో నిల్చోబెడుతున్నాడు. అయినా రాముడి తల్లి తిండి మాత్రం పెట్టగలిగేది కాని స్కూలుకు సంబంధించినవి మాత్రం సమకూర్చలేకపోయింది. రంగయ్య మాత్రం హాయిగా తాగి తందనాలు ఆడుతూనే వున్నాడు.

చూసి చూసి ఒకరోజు మాష్టారు నెల రోజులు గడువుయిచ్చి, అచ్చు పుస్తకాలు తీసుకొని రాకపోతే పేరు కొట్టేస్తానని బెదిరించారు. పాపం! రాముడు దిగులు పడిపోసాగాడు. కుమార్ బాబు విచారానికి అంతులేదు. రాముడు స్కూలుకు రాకపోతే తను ఒంటరివాడై పోతాడు. తనలోని బలహీనతను గుర్తించి మిగతా విద్యార్థులు ఆటపట్టిస్తారు. రాముడైతే చక్కగా మాట్లాడుతాడు. తనతోనే బాగా ఆడతాడు... ఇక రాముడు పేరు కొట్టేస్తే ఎలా?...అన్నిటికి ఆ రంగయ్యే కారణం. తమ యింటికి నాన్నగారు


## లక్కీ నెంబర్లు లాటరీ టిక్కెట్లు

ఈ పుస్తకములో మీ పుట్టిన తేదీని బట్టి ఏఏ ప్రదేశముల లాటరీటిక్కెట్లు జయము కల్గునో వాటి లక్కీనెంబర్లు, అదృష్ట తేదీలు, వారములు, నెలలు ఇవ్వబడినవి. మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి. వెల రు. 2/– పోస్టుద్వారా రు. 2–70 M O. కూపన్‌తో పూర్తి చిరునామా రాయండి.

**P V L K Prasad,**
Near SBI (ESIC)
MACHERLA - 522 426 (A. P.)

## డా. కె.యల్. నారాయణ



వైద్యవిద్వాన్, వైద్యాచార్య

చర్మవ్యాధులకు, స్త్రీల వ్యాధులకు, పక్షవాతం, సుఖ వ్యాధులకు, సెక్సు, నరముల బలహీనతలకు, ఆయుర్వేద చికిత్స.

పోస్టుద్వారా చికిత్స కలదు.

**లక్ష్మీ కుమారి క్లినిక్,**
మెయిన్ రోడ్, తెనాలి.

## సంతానము లేదా?

గర్భవాతము, బహిష్టులో నొప్పులు, ఎక్కువగా తెలుపు, ఎరుపు రుతుస్రావము అగుట, గర్భములు నిలువనివారు, సంతానము లేనివారు ఉత్తమ చికిత్సను సంప్రదించండి ప్రతి శని, ఆదివారములలో మాత్రమే రోగులను పరీక్ష చేయుదురు. ఇదితర దినములలో ముందు అనుమతి పొంది రావలెను.

## నాగు ఫార్మశీ,

(సంతానమునకు మందు తయారు చేయువారు)

గాంధీనగరం, నిడదవోలు - 534301

# దాంపత్యాన్ని గురించి



## ధర్మపథం

-బులుసు వేంకటరమణయ్య

భార్యాభర్తలకు దాంపత్యమనేది పవిత్రమైనది. సంసార జీవితంలో ఇద్దరూ భేదంలేకుండా ప్రవర్తించాలనేది దీని ముఖ్యోద్దేశం. శారీరకంగానూ, మానసికంగానూ ఇద్దరూ ఒక్కటే అనే భావం పరస్పరం ఉండాలి. "దంపతులు" అనేది ఒకే పదం. దాని అర్థం భార్యాభర్తలు. ఈ పదమే వారి ఐక్యతను తెలుపుతూ ఉన్నది.

వివాహానికి ప్రధానమైన పేరు పాణిగ్రహణం. అంటే చెయ్యి పట్టుకోవడం. అంటే – సంసార జీవితంలో ఒకరికొకరు ఆసరాగా ఉండడం అన్నమాట. అలా ఉన్నప్పుడు కష్టంగాని, సుఖంగాని సమానంగా పంచుకోవాలి. ఎట్టి అవస్థ సంభవించినా ఒకరినొకరు అనుసరించే ఉండాలి. అట్టి దాంపత్యంలోనే మనస్సుకు శాంతి లభిస్తుంది. వార్ధక్యంలో కూడా ఒకరిపై ఇంకొకరికి అభిమానం తగ్గదు. అందువల్లనే జీవితాంతం ఒకరినొకరు విడిచిపెట్టి ఉండడమనేది లేదు. ఇప్పుడున్నట్లు విడాకులుఇచ్చే ప్రసక్తే ఉండదు. మనవారి వివాహ సంస్కారంలోని పద్ధతి ఇదే.

ఆదిమ దేవతలైన త్రిమూర్తుల విషయంలో కూడా ఈ సంప్రదాయం వ్యక్తమవుతున్నది. శివుడు అర్ధనారీశ్వరుడు – అంటే శివుని శరీరంలో సగభాగం పార్వతి. తనకంటె తన సతీమణి వేరుకాదనే విషయాన్ని యిది సూచిస్తున్నది. విష్ణుదేవుని వక్షంపై లక్ష్మీదేవి ఉన్నదంటే – ఆయన హృదయంలో ఉన్నదన్న మాట. బ్రహ్మనోటిలో సరస్వతీదేవి ఉన్నదంటారు కదా! ఆ వాగ్దేవి సృష్టికర్త నోటిలో ఉండడం సహజమే! ఆ దంపతుల యిద్దరిమాటా ఒకటే అనే అంశం దీనివల్ల తెలుస్తున్నది. ఇలా, మనోవాక్కాయాలలో దంపతులు త్రికరణశుద్ధిగా – భేదం లేకుండా ఉండడం పయి పురాణగాధల వల్ల తెలుసుకోవలసి ఉన్నది.

పెండ్లి తంతులో అగ్నిసాక్షిగా వధూవరుల చేత పరస్పరం అనుకూలంగా ప్రవర్తిస్తామని ప్రమాణం చేయిస్తారు. ఈవిషయం గ్రహింపక చాలామంది సంప్రదాయాల కింద, లాంఛనాల కిందా లెక్క కడతారు. వివాహమనేది సంప్రదాయ సిద్ధమైన ఒక సంస్కారమని భావిస్తారు. దాంపత్య తత్వాన్ని గ్రహించినవారు మాత్రం దీన్ని అతి పవిత్రమైన సంస్కారంగానూ, జీవితంలో ప్రధానమైనదిగానూ భావిస్తారు. ★

అన్నీ ఎలా సమకూర్చుతున్నారో అలాగే రాముడికి రంగయ్య అన్నీ సమకూర్చాలి రాముడ్ని ప్రేమతో చూసుకునేలా చెయ్యాలి. ఏదో ఒక వుపాయం ఆలోచించి, బాగా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాడు. చివరకు ఒక వుపాయం ఆలోచించి మనసులో పెట్టుకున్నాడు.

రంగయ్య జీతం త్వరలోనే వస్తుందని తను దొరలు తాగే బ్రాంది, విస్కీలు, బిర్యానిలు, కోడివేపుళ్ళు తింటానని కలలు కంటున్నాడు. నలుగురు మిత్రులతో చెప్పి, వాళ్ళనుకూడా కొంత సొమ్ము తెచ్చుకొని తనతో కలవమని ప్రోత్సాహించాడు. స్వర్గమే చూడబోతున్నట్టుగా వుంది అతనికి. చాలా హుషారుగా వుండసాగాడు.

అనుకున్నరోజు రానే వచ్చింది. రంగయ్య జీతం కోసం కుమార్‌బాబు యింటికి వెళ్ళాడు. ఆ రోజు కుమార్‌బాబు పుట్టిన రోజు. కొత్త బట్టలేసుకొని కుమార్‌బాబు తాతగారిని పిలుచుకొని హడావుడిగా బయటికొచ్చి,

"రంగయ్య అర్జంటుగా బజారు వెళ్ళాలి పద. అలాగే నీ జీతం కూడా యిస్తాను" అన్నాడు. మారు మాట లేకుండా రంగయ్య యిద్దర్ని రిక్షా ఎక్కించుకొని బజారు తీసుకెళ్ళాడు.

బజారులో కుమార్‌బాబు తాతగారి సహాయంతో కావాల్సినవన్నీ కొన్నాడు. తర్వాత రిక్షాను రంగయ్య యింటికే పోనివ్వమన్నాడు. తనింటికెందుకో అర్థం కాలేదు రంగయ్యకు.

రిక్షా రంగయ్య యింటికెదురుగా ఆగగానే రాముడు, అతని తల్లి బయటకు వచ్చారు.

"రాముడూ! ఈ రోజు నా పుట్టినరోజు! యిదిగో మిఠాయి" అని అందిస్తూ మళ్ళీ అన్నాడు "ఈ రోజు నా పుట్టినరోజే కాదు ... మీ నాన్నకు జీతం వచ్చేరోజు. ఆ డబ్బులలో నీకు అచ్చుపుస్తకాలు, నోట్సులు, జతబట్టలు కొన్నాను" తెచ్చిన వస్తువులన్నీ యిచ్చాడు. రంగయ్యకు మాత్రం నోటమాట రాలేదు.

"రంగయ్యా! నువ్వు సంపాదించినదంతా తాగి పాడుచేసుకుంటున్నావని, రాముడ్ని స్కూల్లో తీసేస్తారని రోజు బాధపడుతూ చెప్పేవాడు కుమార్‌బాబు. నీ జీతం నీ కుటుంబానికి పనికి వచ్చేలా చేస్తే నువ్వు కాస్త తెలుసుకుంటావని యిలా చేశాను" అని కుమార్‌బాబు వాళ్ళ తాతగారు అన్నారు.

కుమార్‌బాబు రాముడితోగల అనుబంధాన్ని, రాముడు పడుతున్న బాధలను మొదటనుంచి చివరిదాకా వివరంగా చెప్పాడు.

"ఇప్పుడు చెప్పు రంగయ్యా ... నేను చేసింది తప్పంటావా? మా నాన్నగారు మమ్మల్ని ఎలా సంతోష పెడుతున్నారో – అలాగే నువ్వు కూడా మీ యింట్లో వాళ్ళను సంతోష పరచాలని యిలా చేశాను. రాముడు చాలా బాగా చదువుతున్నాడు. వాడి చదువు ఆపొద్దు రంగయ్యా. రాముడు చదువు మానేస్తే ... నేను కూడా సరిగా చదువుకోలేను" అని కుమార్‌బాబు అంటే రంగయ్య గతాన్ని తలచుకొని తప్పులను గుర్తించి,

"బాబూ... నా కళ్ళను తెరిపించావు. నిజంగా పశువులాగా ప్రవర్తించాను. ఇంకెప్పుడూ తాగను. నీమీద ఒట్టు. ఎన్ని కష్టాలు వచ్చినాసరే రాముడ్ని బాగా చదివిస్తాను. వృద్ధిలోకి తెస్తాను" అని మాటిచ్చాడు. అన్నమాట ప్రకారం రంగయ్య యిప్పటికి బుద్ధిగా వున్నాడు. కాని కుమార్‌బాబు పెరిగి పెద్దవాడై అంతా మరచిపోయాడు. అడ్డదార్లు తొక్కాడు. మారని రంగయ్యను చూడగానే బాల్యమంతా గుర్తుకొచ్చింది. ఒకనాడు తనేమిటో యిప్పుడు తను ఏం చేస్తున్నాడో తెలుసుకున్నాడు.

అలా కథ పూర్తిచేశాడు కిరణ్.

"మాటలతో మచ్చిక చేసుకొని అడగగా తన కథంతా చెప్పాడు కుమార్‌బాబు. పసితనంలో మనిషిలో దైవం ఉంటారంటారు. అందుకే తనలాగే రాముడుండాలని ఆశించాడు. పరిస్థితులనుబట్టి విడిపోయినా రంగయ్య బుద్ధిగానే వున్నాడు, కాని కుమార్‌బాబు? ఒకనాడు రంగయ్యకు కుమార్ బాబు 'గైడ్' అయ్యాడు. ఈనాడు కుమార్‌బాబుకు రంగయ్య "గైడ్" అయ్యాడు. మళ్ళీ కుమార్‌బాబు నాకు 'గైడ్' అయ్యాడు. కనుక రేపటి నుంచి నేను మందు పార్టీలకు, పేకాటలకు రానేరాను." అని చెప్పి స్నేహితుల నుంచి చల్లగా జారుకున్నాడు కిరణ్. ★